క్లుప్తంగా

రేమద్దుల వాసికి డాక్టరేట్



పాన్‌గల్: మండలంలోని రేమద్దులకు చెందిన మండ్ల రవి ఎకనామిక్స్‌లో ఉస్మానియా యూనివర్సిటీ నుంచి డాక్టరేట్ సాధించారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన మండ్ల చిన్న బాలయ్య, రామచంద్రమ్మ కుమారుడు మండ్ల రవి ప్రాథమిక స్థాయి నుంచి పదో తరగతి వరకు రేమద్దుల ప్రభుత్వ పాఠశాల, ఇంటర్, డిగ్రీ వనపర్తి ప్రభుత్వ కాలేజీ, బీఈడీ పూర్తి చేశారు. అనంతరం ఉస్మానియా యూనివర్సిటీలో ఎం.ఏ ఎకనామిక్స్ పూర్తి చేసి పీహెచ్‌డీ సాధించారు. ఓయూలో అర్థశాస్త్ర విభాగంలో పనిచేసిన ప్రొఫెసర్ టీఎల్‌ఎస్ స్వామి పర్యవేక్షణలో 'ఉమ్మడి పాలమూరు జిల్లా వలస కూలీల ఆర్థిక, సామాజిక స్థితిగతుల అంశాలపై' పరిశోధన సమర్పించగా యూనివర్సిటీ అధికారుల పరిశీలన అనంతరం డాక్టరేట్ ప్రకటించినట్లు ఆయన పేర్కొన్నారు.

గిరిజన మహాసభకు తరలిరావాలి

పాన్‌గల్: మండలంలోని తెల్లరాళ్లపల్లిలో ఆదివారం నిర్వహిస్తున్న గిరిజన సంఘం జిల్లా రెండో మహాసభలకు జిల్లాలోని తండాల నుంచి గిరిజనులు పెద్ద సంఖ్యలో గిరిజనులు పాల్గొని మహాసభలను జయప్రదం చేయాలని గిరిజన సంఘం జిల్లా అధ్యక్షుడు బాల్యానాయక్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ మహాసభకు రాష్ట్ర, జిల్లా గిరిజన సంఘం నాయకులు పాల్గొంటున్నట్లు ఆయన పేర్కొన్నారు.

నేటి నుంచి ఈదమ్మ జాతర



ఖిల్లాఘనపురం: మండల ప్రజల ఆరాధ్య దైవం ఈదమ్మ తల్లి జాతర ఆదివారం నుంచి నిర్వహిస్తున్నట్లు శాలివాహన సంఘం సభ్యులు తెలిపారు. ఆదివారం నుంచి వారం రోజుల పాటు ఈ అమ్మవారి జాతర జరుగుతుందని తెలిపారు. జాతరను పురస్కరించుకుని ఆలయాన్ని అందంగా అలంకరించారు. ఆలయం చుట్టు శుభ్రం చేయడంతో పాటు భక్తుల కోసం తాగునీరు తదితర వసతులు ఏర్పాటు చేశారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా నలుమూలల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో ఈ జాతరకు తరలివస్తుంటారు.

ఎయిడ్స్‌పై కళాజాతా ప్రదర్శన



పెబ్బేరు: పట్టణ కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఆధ్వర్యంలో శనివారం ఎయిడ్స్‌పై కళాజాత ప్రదర్శన చేశారు. ఈ సందర్భంగా కళాకారులు ఆట, పాట, మాటలతో ఎయిడ్స్‌పై తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పిస్తూ వ్యాధి నియంత్రణ చర్యలు వివరించారు. కార్యక్రమంలో కవితదేవి, సరస్వతి, డాక్టర్ రాకేష్‌రెడ్డి, హెచ్‌ఓపీఈ ఐఐ కొత్తకోట స్వచ్ఛంద సంస్థ సభ్యులు సునీల్, చాహన్, పీఎం శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

14న అమరవీర జవాన్ల దినోత్సవం



వనపర్తి క్రైం: దేశ సంస్కృతి, సంప్రదాయాలకు విరుద్ధంగా నిర్వహించే ఏ కార్యక్రమాన్నైనా బహిష్కరించాలని.. ఫిబ్రవరి 14న ప్రేమికుల రోజును బహిష్కరించి అమరవీర జవాన్ల దినోత్సవాన్ని నిర్వహించాలని విశ్వహిందు, భజరంగ్‌దళ్ జిల్లా అధ్యక్షుడు శివకృష్ణ అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలో నాయకులు వాల్‌పత్రికను విడుదల చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ 2019 ఫిబ్రవరి 14న జరిగిన పుల్వామా ఉగ్రదాడిలో అమరులైన జవాన్లకు సంతాపంగా ప్రతి ఏడాది నిర్వహించాలని కోరారు. యువతి, యువకులను అవగాహన కల్పించేందుకు జిల్లా వ్యాప్తంగా సదస్సులు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ పట్టణ అధ్యక్షుడు సాయితేజ, సంతోష్, చంద్ర, కురుమూర్తి, మహేందర్, భరత్ తదితరులు పాల్గొన్నారు.

హరహర మహాదేవ.. శంభో శంకర



ఆత్మకూర్: నియమ నిష్ఠలతో 41 రోజుల పాటు శివ దీక్ష పొందిన మాలధారులు శనివారం చేపట్టిన ఇరుముడి మహోత్సవం సందర్భంగా శివ నామస్మరణతో పిన్నంచర్ల పులకించిపోయింది. మండలంలోని పిన్నంచర్లలోని శ్రీఅభయాంజనేయస్వామి ఆలయం వద్ద పూజారి ఎంకోబారావు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూజలకు హాజరైన భక్తులకు, శివ మాలధారులకు ఎంపీపీ బంగారు శ్రీనివాసులు ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. అనంతరం దీక్షపరులు పాదయాత్రగా శ్రీశైలం మల్లన్న సన్నిధికి తరలివెళ్లారు. కార్యక్రమంలో సర్పంచ్ లక్ష్మి, ఉపసర్పంచ్ మాసన్న, మాజీసర్పంచ్ వెంకటేష్, నిర్వాహకులు మచ్చేందర్‌గౌడ్, ఉపేందర్, శివస్వాములు, భక్తులు పాల్గొన్నారు.



పిన్నంచర్ల నుంచి శ్రీశైలానికి పాదయాత్రగా వెళ్తున్న దీక్షాపరులు

శివుడికి మహా పడిపూజ

వీపనగండ్ల: మండల కేంద్రంలో శనివారం శివస్వాములు మహాపడి పూజ కార్యక్రమాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా రుద్రాభిషేకం, మెట్లపూజ, పంచామృతాలతో అభిషేకాలు, బిల్వార్చన పూజలు చేశారు. పూజల్లో ముంత ఆంజనేయులు, చెన్నమ్మ దంపతులు ప్రత్యేక పూజలు చేశారు.



ప్రత్యేక పూజలో ఎంపీపీ మామిళ్లపల్లి శ్రీధర్‌రెడ్డి

కేతేపల్లి ఆలయంలో శివ మాలధారుల ప్రత్యేక పూజలు

పాన్‌గల్: మండలంలోని కేతేపల్లి శ్రీ రామలింగేశ్వరస్వామి ఆలయంలో శివమాలధారుల ఆధ్వర్యంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ మామిళ్లపల్లి శ్రీధర్‌రెడ్డి పాల్గొని ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. శివ మాలధారులు ఎంపీపీని శాలువాతో ఘనంగా సన్మానించారు.

సర్వే పూర్తి చేసి హద్దులు ఏర్పాటు చేస్తాం



ప్లాట్ల స్థలాన్ని సర్వే చేస్తున్న అధికారులు

పాన్‌గల్: బీసీలకు కేటాయించిన ప్లాట్ల స్థలాన్ని సర్వే చేసి హద్దులు ఏర్పాటు చేస్తామని చిక్కేపల్లి సర్పంచ్ బాలస్వామియాదవ్ అన్నారు. గ్రామంలో బీసీలకే కేటాయించిన సర్వే నెం 361లోని స్థలాన్ని సర్వే చేయించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. గ్రామంలో బీసీలకు కేటాయించిన ప్లాట్ల స్థలం హద్దులు ఏర్పాటు చేయకపోవడంతో లబ్ధిదారులకు పంపిణీలో జాప్యం జరుగుతుందన్నారు. దీంతో ఈ విషయాన్ని ఎంపీపీ మామిళ్లపల్లి శ్రీధర్‌రెడ్డి ద్వారా కొల్లాపూర్ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లడంతో ఆయన స్పందించి రెవెన్యూ అధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో అధికారులు సర్వే ప్రారంభించినట్లు సర్పంచ్ పేర్కొన్నారు. కార్యక్రమంలో సర్వేయర్ పెన్నయ్య, బీఆర్ఎస్ నాయకులు వెంకట్రాములుయాదవ్, రాముయాదవ్, బిచ్చాల్, నర్సింహ, గ్రామస్తులు పాల్గొన్నారు.

చెవి వినికిడి యంత్రం అందజేత



మదనాపురం: మండలంలోని రామన్‌పాడుకు చెందిన తెలుగు విష్ణుకు టీపీసీసీ ప్రధాన కార్యదర్శి కాటం ప్రదీప్‌కుమార్‌గౌడ్ చేయూతతో శనివారం స్వగ్రామంలో టీపీసీసీ మైనార్టీ రాష్ట్ర కార్యదర్శి ఎండీ అంజాద్ అలీ రూ.10 వేల విలువ చేసే చెవి వినికిడి యంత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారికి బాధితులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఎండీ ఖదీర్, నాయకులు నందునాయక్, చెన్నకేశవ, శివశంకర్, దారపోని రాములు, రాములు నాయక్, కురుమూర్తి, మండల శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

దీన్‌దయాళ్ ఆశయాలను కొనసాగిద్దాం

అమరచింత: పండిత్ దీన్‌దయాళ్ ఆశయాలను ప్రతి ఒక్కరూ ముందుకు తీసుకెళ్లాలని బీజేపీ రాష్ట్ర నాయకుడు మాదిరెడ్డి జలంధర్‌రెడ్డి, హైదరాబాద్ డిప్యూటీ మేయర్ సుభాష్ చంద్రజీ కోరారు. పండిత్ దీనదయాల్ ఉపధ్యాయ జయంతి సందర్భంగా శనివారం పట్టణంలో ఆయన చిత్రపటానికి ఘనంగా నివాళులర్పించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ దేశ ఔన్నత్యాన్ని చాటి చేప్పే వ్యక్తులుగా నేటి తరం యువకులు ముందుకు సాగాలన్నారు. కార్యక్రమంలో మరాఠి అశోక్, మేర్వరాజు, క్యామ భాస్కర్, మల్లారెడ్డి, హరీష్, రామలింగం తదితరులు పాల్గొన్నారు.



దీన్‌దయాళ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు

భక్తిశ్రద్ధలతో గణపతి హోమం



మదనాపురం: మండలంలోని శంకరమ్మపేటలో దేవతామూర్తుల విగ్రహాల ప్రతిష్ఠ కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. శనివారం వేద పండితుల గోపాలకృష్ణ బృందం వేద పారాయణం, సర్వదేవత మండప ఆరాధన, గణపతి లక్ష్మి నవగ్రహ వాస్తు హోమం, తీర్థ ప్రసాద వితరణ కార్యక్రమాలను నిర్వహించారు. ఆదివారం ఆరాధన, ప్రతిష్ఠ యంత్రాపన అనంతరం ఆంజనేయస్వామి, శివుడు, రాధాగోపాలకృష్ణ సంతాన నాగ నవగ్రహ, ధ్వజస్తంభ దీప స్తంభం ప్రతిష్ఠ కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో జరుగుతాయని అర్చకులు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ పద్మమ్మ, ఉప సర్పంచ్ డబ్బా కృష్ణయ్య, రాజ్ కుమార్, సురేష్ పాల్గొన్నారు.

ప్రభుత్వ ప్రజా వ్యతిరేఖ విధానాలపై పోరాటం



దుప్పల్లిలో మాట్లాడుతున్న ఎగ్గని

మదనాపురం: రాష్ట్ర ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలపై పోరాటం చేస్తామని బీజేపీ రాష్ట్ర నాయకుడు ఎగ్గని నర్సింహులు హెచ్చరించారు. శుక్రవారం రాత్రి ప్రజా గోస బీజేపీ భరోసా కార్నర్ సమావేశం దుప్పల్లిలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఆయన హాజరయ్యారు. ఈ సందర్భగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో పేదలకు డబుల్ బెడ్ రూం ఇళ్లు ఇవ్వడం లేదని మండిపడ్డారు. దళితులకు మూడు ఎకరాల భూమి, నిరుద్యోగులకు నిరుద్యోగ భృతి ఏమైందనని ప్రశ్నించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు రాజవర్ధన్‌రెడ్డి, బాలమణెమ్మ, విజయేందర్ రెడ్డి, మండల అధ్యక్షుడు కృష్ణయాదవ్, రాజశేఖర్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

21న మదర్సా వార్షికోత్సవం

ఆత్మకూర్: పట్టణంలోని మదర్సా ఇమాదుల్ ఉలూం (అరబ్బీ పాఠశాల) 22వ వార్షికోత్సవం ఈనెల 21న సాయంత్రం 6 గంటలకు నిర్వహిస్తున్నామని ప్రిన్సిపాల్ హఫీజ్ జియాఉర్ రహ్మాన్, హెడ్‌మాస్టర్ హాఫీస్ రఫీయోద్దీన్ తెలిపారు. శనివారం మసీదులో వార్షికోత్సవం పోస్టర్లను విడుదల చేశారు. ఇక్కడ దివ్యఖురాన్ పఠనం పూర్తి చేసిన విద్యార్థులకు సన్మానం నిర్వహిస్తారన్నారు. ఈసందర్భంగా మహ్మద్ ప్రవక్త దివ్య సూక్తులను తెలంగాణ, ఆంధ్ర అరబ్బిక్ స్కూల్స్ అధ్యక్షుడు మౌలానా జమాలుర్ రహ్మాన్, మౌలానా అహ్మద్‌వ మీజ్‌సాహేబ్, మౌలానా జుబేర్‌అహ్మద్‌ఖాన్, ప్రముఖ మౌలానాలు, వక్తలు, దైవ సందేశమిస్తారని తెలిపారు.

సంతలో మోటార్ సైకిల్ చోరీ

పెబ్బేరు: పట్టణ కేంద్రంలో శనివారం జరిగిన సంతలో కిష్టగిరికి చెందిన మాజీ ఉప సర్పంచ్ రాములుకు చెందిన మోటార్ సైకిల్ చోరీకి గురైందని పోలీసులకు ఫిర్యాదు చేశారు. టీఎస్06ఇకే6609 నంబరు గల బైకును ఆపి తమ పనులు ముగించుకొని తిరిగి వచ్చేసరికి బైకు కనిపించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశానని రాములు తెలిపారు.

సీఎం చిత్రపటానికి పాలాభిషేకం



పెబ్బేరులో సీఎం కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న నాయకులు

పెబ్బేరు: పట్టణ కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో వాల్మీకి బోయ సంఘం ఆధ్వర్యంలో సీఎం కేసీఆర్, మంత్రి నిరంజన్‌రెడ్డి చిత్రపటాలకు శనివారం పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా అసెంబ్లీలో వాల్మీకి బోయలను ఎస్టీ జాబితాలో చేర్చేందుకు ముఖ్యమంత్రి కేసీఆర్ తీర్మానం చేయడంతో వాల్మీకి నాయకులు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో హరిశంకర్‌నాయుడు, మునీశ్వర్‌నాయుడు, బలరాం, వీరస్వామి, వెంకటయ్య, కుమారస్వామి, గోవర్ధన్, కృష్ణ, మూర్తి, తిరుపతి పాల్గొన్నారు.

ఎస్‌హెచ్‌సీ దివ్యాంగుల పింఛన్లు..

పట్టణ కేంద్రంలోని దివ్యాంగుల పునరావాస కేంద్రంలో పనిచేస్తున్న ఎస్‌హెచ్‌సీ సిబ్బందికి పింఛన్లు మంజూరు చేయడంతో మంత్రి కేసీఆర్‌కు పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో లక్ష్మి, చౌడమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూర్: రాష్ట్రంలోని వాల్మీకి బోయలను ఎస్టీ జాబితాలో చేర్చే విధంగా అసెంబ్లీ సమావేశాల్లో ఏకగ్రీవంగా తీర్మానించడం హర్షనీయమని వాల్మీకి బోయ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ మండ్ల రామకృష్ణ అన్నారు. శనివారం స్థానిక గాంధీచౌక్‌లో ముఖ్యమంత్రి కేసీఆర్, మక్తల్ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. వాల్మీకులకు న్యాయం చేయాలంటూ సుదీర్ఘకాలంగా పోరాటం చేస్తున్నామని రాష్ట్ర ప్రభుత్వం సముచిత నిర్ణయం తీసుకుని అసెంబ్లీలో తీర్మానించడం శుభపరిణామమని అన్నారు. కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్ సమావేశాల్లోనే వాల్మీకుల ఎస్టీ రిజర్వేషన్ బిల్లును ఆమోదించి తమకు న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు మండ్లవిజయ్, కావలి వెంకటన్న, ఎస్టీడీ శ్రీనివాసులు, కొత్త బోయ శేఖర్, సత్యన్న, భీమన్న, గోవిందు, మాసూం, కుర్మన్న, ఖాజన్న, రాము, రఘు, సురేందర్ తదితరులు ఉన్నారు.

పెళ్లికి బాల్యమిత్రుల ఆర్థికసాయం



గోపాల్‌పేట: స్నేహితురాలి కుమార్తె వివాహానికి బాల్యమిత్రులంతా కలిసి ఆర్థికంగా చేయూతనిచ్చి అండగా నిలిచారు. వివరాల్లోకి వెళ్తే.. పాన్‌గల్ మండలంలోని కేతేపల్లి జెడ్పీహెచ్‌ఎస్‌లో 1991–92 విద్యా సంవత్సరంలో పదో తరగతి విద్యార్థుల్లో ఒకరైన ప్రమీల గోపాల్‌పేటలో నివసిస్తున్నారు. ఆమె కూతురి వివాహం ఈ నెల 12న నిర్వహించనుండగా బాల్యమిత్రులంతా కలిసి దాదాపు రూ.40వేల వరకు వివాహ ఖర్చుల నిమిత్తం ప్రమీలకు శనివారం అందజేసి స్నేహభావాన్ని చాటుకున్నారు.

ఖిల్లాఘనపురం: బాల్య మిత్రుడి కూతురు వివాహానికి నాడు కలిసి చదువుకున్న మిత్రులంతా కలిసి శనివారం ఆర్థికసాయం చేశారు. 1986–87 విద్యా సంవత్సరంలో ఖిల్లాఘనపురం బాలుర ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుకున్న నాటి విద్యార్థుల్లో ఖిల్లాఘనపురం గ్రామానికి చెందిన నారాయణచారి మృతి చెందారు. ఇంటి పెద్దను కోల్పోయిన ఆ కుటుంబం ఇబ్బందుల్లో ఉన్న సంగతి ఇటీవల పూర్వ విద్యార్థుల కలయిక సమయంలో తోటి మిత్రులు తెలుసుకున్నారు. ఆదివారం మిత్రుడి కూతురు వైష్ణవికి వివాహం చేస్తున్నారని తెలుసుకున్న వారు కొంత నగదును పోగు చేసి మొత్తం రూ.31,516 నారాయణచారి భార్య సువర్ణ, కూతురు వైష్ణవిని కలిసి అందజేశారు. కార్యక్రమంలో పాలవాది శ్రీనివాసులు, సత్యశీలారెడ్డి, నరేందర్, డాక్టర్ నరేందర్, నల్లమద్ది నర్సింహారెడ్డి, అంజనేయులు, తిరుపతయ్య, మంగళి అంజనేయులు, నర్సింహారెడ్డి, సాకలి శ్రీను, ఉపాధ్యాయులు రాంగోపాల్‌రెడ్డి, కొండారెడ్డి, శేఖర్ పాల్గొన్నారు.

ముమ్మరంగా పారిశుద్ధ్య పనులు



దోమల మందు పిచికారీ చేస్తున్న మున్సిపల్ వైస్‌చైర్మన్ శ్రీధర్



చెలిమిల్లలో..

వనపర్తి టౌన్: జిల్లా కేంద్రంలో రోజురోజుకూ దోమల వ్యాప్తి అధికమవుతుందని, దీంతో ప్రజలు రోగాల బారిన పడే అవకాశం ఉందని, అప్రమత్తంగా ఉండాలని మున్సిపల్ వైస్ చైర్మన్ వాకిటి శ్రీధర్ అన్నారు. శుభ్రతే ఆరోగ్యానికి రక్ష అని తెలిపారు. మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి సూచన మేరకు శనివారం జిల్లా కేంద్రంలోని 1వ వార్డులో బయోటిక్స్ స్ప్రే కార్యక్రమాన్ని వార్డు కౌన్సిలర్ కాగితాల లక్ష్మీనారాయణతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వైస్ చైర్మన్ మాట్లాడుతూ.. దోమల వ్యాప్తి అరికట్టడం అధికారుల పని అన్నట్లు భావించకుండా కలిసి కట్టుగా అందరూ సహకరించాలని కోరారు. డ్రైయినేజీలు, చెత్త పారవేసే స్థలాల్లో దోమల వ్యాప్తి ఎక్కువగా ఉంటుందని, ఇంటి, పరిసరాల చెత్తా చెదారాలను మున్సిపల్ ట్రాక్టర్‌లో వేసి, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. దోమలు పెట్టిన గుడ్ల లార్వా నివారణ చర్యలకు మున్సిపల్ అధికారులు శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. కార్యక్రమంలో 21వ వార్డు కౌన్సిలర్ వెంకటేష్, మున్సిపల్ సిబ్బంది మన్నెం పాల్గొన్నారు.

వ్యాధులతో అప్రమత్తం

పెబ్బేరు: పట్టణ కేంద్రంలోని పలు వార్డుల్లో పరిశుభ్రతపై అవగాహన కల్పిస్తూ శనివారం మున్సిపల్ చెర్‌పర్సన్ కరుణశ్రీ డ్రైయినేజీలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, డ్రైయినేజీలను ఎప్పటికప్పుడు శుభ్రం చేయడంతో పాటు యాంటీ లార్వా ద్రావణాన్ని పిచికారీ చేయిస్తున్నామన్నారు. కార్యక్రమంలో మేనేజర్ గణేష్‌బాబు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఉమామహేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై ప్రభుత్వాన్ని నిలదీద్దాం

వీపనగండ్ల: రాష్ట్ర ప్రభుత్వం అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేఖ విధానాలను ఎండగట్టేందుకు బీజేపీ కార్యకర్తలంతా ఏకం కావాలని నాగర్‌కర్నూల్ జిల్లా బీజేపీ అధ్యక్షుడు, కొల్లాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఎల్లేని సుధాకర్‌రావు అన్నారు. శనివారం మండల కేంద్రంలో బీజేపీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో పాల్గొని ఆయన ప్రసంగించారు. బీఆర్ఎస్ పార్టీ ప్రజలను మోసం చేసి అసత్య ప్రచారంతో అధికారంలోకి రావాలని చూస్తుందని, ఈ విషయాన్ని ప్రజలకు విడమరిచి చెప్పాలని ఆయన కార్యకర్తలను కోరారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను స్థానిక ఎమ్మెల్యే మరిచారని, రాబోయే ఎన్నికల్లో కొల్లాపూర్ కోటపై బీజేపీ జెండా ఎగరడం ఖాయమని జోస్యం చెప్పారు. కార్యక్రమంలో మండల అధ్యక్షులు రాకేశ్‌యాదవ్, ప్రధాన కార్యదర్శి నారాయణ, జిల్లా కార్యవర్గ సభ్యులు శివాజీ, వెంకటయ్య పాల్గొన్నారు.



వీపనగండ్లలో మాట్లాడుతున్న ఎల్లేని సుధాకర్‌రావు

పెబ్బేరు రూరల్ (శ్రీరంగాపురం): రాష్ట్రంలో భారతీయ జనతా పార్టీ ప్రభుత్వం ఏర్పడం చేయడం ఖాయమని జిల్లా బీజేపీ అధ్యక్షుడు ఎద్దుల రాజవర్ధన్‌రెడ్డి అన్నారు. మండల బీజేపీ ఆధ్వర్యంలో శనివారం మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో ఏర్పాటు చేసిన గ్రామ శక్తి కేంద్ర కార్నర్ బూత్ స్థాయి సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధాన మంత్రి నరేంద్రమోదీ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను మండలంలోని ప్రతి గ్రామంలో బూత్ స్థాయి కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి ప్రజలకు వివరించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వం ఏర్పడి తొమ్మిదేళ్లు అవుతున్నా ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలు నెరవేర్చలేదని ఈ సందర్భంగా గుర్తు చేశారు. కార్యక్రమంలో వనపర్తి నియోజక వర్గ కన్వీనర్ శ్రీనివాస్‌గౌడ్, జిల్లా ప్రధాన కార్యదర్శి నారాయణ, మండల ఇన్‌చార్జి రామన్నగారి వెంకటేశ్వర్‌రెడ్డి, మండల బీజేపీ అధ్యక్షుడు వెంకటస్వామి, బూత్ అధ్యక్షుడు రాము, రాజశేఖర్, కార్యకర్తలు పాల్గొన్నారు.

వనపర్తి అసెంబ్లీ నుంచే 'రావుల' పోటీ

వనపర్తి క్రైం: వనపర్తి అసెంబ్లీ నియోకవర్గంలో మరోసారి మాజీ ఎమ్మెల్యే రావుల చంద్రశేఖర్‌రెడ్డి పోటీలో ఉంటారని టీడీపీ పట్టణ అధ్యక్షుడు నందిమల్ల అశోక్ అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని టీడీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడుతూ అన్నివర్గాల ప్రజలు చేస్తున్న ఒత్తిడి మేరకు రావుల వనపర్తిలో పోటీ చేయడానికి సుముఖంగా ఉన్నారని, అందుకు టీడీపీ నాయకులు కృషి చేస్తున్నారన్నారు. రాజకీయ సమీకరణాలు పూర్తయిన తర్వాత నిర్ణయం ప్రకటిస్తారని, వనపర్తి నుంచి గెలిచే సత్తా రావులకు ఉందని ధీమా వ్యక్తం చేశారు. ఎన్నికల్లో లబ్ధి పొందేందుకు పోడు భూముల రైతులకు ఆశలు కల్పిస్తున్నారని, కేసీఆర్ స్వయంగా పర్యటించి పట్టాలిస్తారని చెప్పిన బీఆర్ఎస్ నాయకులు నేడు లబ్ధిదారుల నుంచి భూమి లాక్కొని రోడ్డున పడేశారని విమర్శించారు. పోడు భూముల హక్కుల కోసం పోరాటం చేస్తున్న రైతులపై కేసులు పెట్టారని దుయ్యబట్టారు. పోడు భూములు సాగు చేసిన రైతులకు పట్టాలివ్వాలని డిమాండ్ చేశారు. వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చాలని 2017లో తీర్మానం చేశారని, కానీ నేటికీ కార్యరూపం దాల్చలేదని మండిపడ్డారు. కార్యక్రమంలో ఏర్పుల రవి, వహీద్, ఖాదర్, బాలరాజు, బాలు, దస్తగిరి ఉన్నారు.



మాట్లాడుతున్న నందిమల్ల అశోక్

ముందస్తు అరెస్టులతో ఉద్యమాన్ని ఆపలేరు



పోలీస్‌స్టేషన్‌లో భూమయ్య తదితరులు

ఖిల్లాఘనపురం: వడ్డెరులు నిరసన తెలపకుండా రాష్ట్ర ప్రభుత్వం ముందస్తుగా అరెస్టులు చేసినంత మాత్రాన రాష్ట్రంలోని వడ్డెరుల ఆగ్రహాన్ని ఆపలేరని వడ్డెర సంఘం జిల్లా అధ్యక్షుడు దాసర్ల భూమయ్య తెలిపారు. శనివారం అసెంబ్లీ ముట్టడికి వడ్డెర రాష్ట్ర కమిటీ పిలునివ్వడంతో ఉదయం నుంచి మండలంలోని వడ్డెర సంఘం జిల్లా అధ్యక్షుడితో పాటు పలువురు నాయకులను ఖిల్లాఘనపురం పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా భూమయ్య మాట్లాడుతు వడ్డెరులను ఎస్టీ జాబితాలో చేర్చుతామని 40ఏళ్లుగా ప్రభుత్వాలు, పాలకులు మోసగిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తరువాత తమ ఆశయాలు నెరవేరుతాయని ఎన్నో కలలు కన్నా అవి నెరవేరలేదని వాపోయారు. తెలంగాణ ఉద్యమంలో ముందుండి పోరాడిన తమను ఎస్టీ జాబితాలో చేర్చుతామని, వడ్డెర ఫెడరేషన్‌కు ప్రత్యేక నిధులు ఇచ్చి ఆదుకుంటామని చెప్పినా నెరవేరలేదన్నారు. అరెస్టు చేసిన వారిలో శాంతయ్య, శ్రీరాములు, మల్లేష్, అంజనేయులు, రామస్వామి, భీచుపల్లి, కృష్ణయ్య, యాదయ్య తదితరులు ఉన్నారు.

మున్సిపల్ చైర్మన్ బాధ్యత వహించాలి

వనపర్తి టౌన్: రోడ్ల విస్తరణలో జరిగే ప్రమాదాలకు మున్సిపల్ చైర్మన్ గట్టుయాదవ్ బాధ్యత వహించాలని బహుజన సమాజ్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు చిరంజీవి డిమాండ్ చేశారు. ఈ మేరకు జిల్లా కేంద్రంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పట్టణంలో జరుగుతున్న రోడ్ల విస్తరణ పనులు నాణ్యత లోపంగా జరుగుతున్నాయని విస్మయం వ్యక్తం చేశారు. రోడ్ల విస్తరణ పనుల్లో జాగ్రత్తలు తీసుకోకుండా కరెంట్, టెలిఫోన్ స్తంభాలు, మురికి కాలువలను ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయకుండా ఇష్టారీతిన విస్తరిస్తున్నారని దుయ్యబట్టారు.